క్లుప్తంగా

నిత్యావసరాలు అందజేత


వెంకట్యాతండాలో నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు సహాయ సహకారాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని, అందరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండాలో గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు రూ.30వేల నగదు, రూ.30వేల విలువైన నిత్యావసరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రఘు నాయక్, మండల కోఆర్డినేటర్ పోరండ్ల రమేష్, నాయకులు ఈది గణేష్, కుర్రా అనిల్, రేఖ శివాజీ, కుంజా వీరభద్రం, కొల్లూరి సాయి, తరుణ్, వెంకన్న, సాయి పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి నంబర్ ఇస్తాం..


మాట్లాడుతున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: మున్సిపాలిటీలో అర్హత ఉన్న ప్రతీ ఇంటికి ఇంటి నంబర్ ఇస్తామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మాట్లాడుతూ.. ఈ నెల 17న పట్టణంలోని కొత్త కాలనీలో 12, 13 వార్డుల వారికి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి ఇంటి నంబర్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కొత్త కాలనీ వాటర్ ట్యాంకు కింద ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

జీఎంకు మెమెంటో


ఏరియా జీఎంకు మెమెంటో అందజేస్తున్న శ్రీనివాస్, సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజుకు ఆదివారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ విలువైన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటం మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ అభివృద్ధికి తీసుకున్న నిర్ణయం అభినందనీయ మన్నారు.

సింగరేణిలో షాపింగ్ మాల్


మాట్లాడుతున్న జీఎం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెంలోని మెయిన్ రోడ్ (ఎంజీరోడ్)లో సుమారు 70 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన సుమారు 30 షాపులను తొలగించి వాటి స్థానంలో రూ.4.5 కోట్ల ఖర్చుతో కొత్తగా జీ+1 షాపులను నిర్మించనున్నట్లు జీఎం సివిల్ బి.సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచన మేరకు స్పందించిన సంస్థ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంజీ రోడ్డులో సంస్థకు చెందిన రూ.కోట్ల స్థలాలు అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకోవటమే కాకుండా సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా షాపింగ్‌లను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. దీనిలో భాగంగా సింగరేణి స్థలాల వద్ద షాపింగ్ మాల్ నిర్మించాలనే భావిస్తోందని వివరించారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

ఇల్లెందు: పట్టణంలోని 22వ వార్డులో ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న స్థలంలో వారం రోజులుగా ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఇది అక్రమమని బస్తీ ప్రజలు, పలు శాఖల అధికారులు పేర్కొంటుండగా ఆ ఇంటి నిర్మాణం మాత్రం ఆగటం లేదు. తాజాగా ఆదివారం కూడా నిర్మాణ పనులు సాగాయి. అధికారుల ఉదాసీనతా లేక రాజకీయ నేతల హస్తం ఉందో తెలియదు కానీ నిర్మాణం మాత్రం జరుగుతోంది. నాలుగు రోజుల క్రితం స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు తనిఖీ చేశారు. ఈ స్థలం వివాదం పరిష్కారం అయ్యే వరకు నిర్మాణం చేయరాదని ఆదేశించారు. రెండు రోజులు ఆ పనులు నిలిపివేసి, తాజాగా మళ్లీ పనులు మొదలు పెట్టారంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా తామంతా న్యాయమూర్తికి, తహసీల్దా ర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని అయినా నిర్మా ణం జరుగుతోందని, దీని వెనుక రాజకీయ హస్తం ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆ భూమి తమదేనని భూమి పత్రాలు ఉన్నాయని యజమాని అంటున్నాడు.

దిగుబడి రాలేదు.. ధరా లేదు

ఈ ఏడాది పత్తి సాగు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఎంతో కష్టపడి రూ.వేలు పెట్టుబడి పెట్టి పంటను సాగుచేస్తే చేసిన కష్టం, దిగుబడి ఏమో కానీ, కనీసం పెట్టుబడి రాకపోగా అప్పుల పాలు చేసింది. ఆ వచ్చిన కొద్ది పంటకైనా మార్కెట్‌లో సరైన ధర లభిస్తుందనుకుంటే నాణ్యత లేదనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో ఎటూ పాలు పోని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లే..
- నాణ్యత లేదని తక్కువ ధరకు పత్తి కొనుగోళ్లు
- లబోదిబోమంటున్న రైతులు


సుజాతనగర్‌లో సాగు చేసిన పత్తి చేను

సుజాతనగర్: మండలంలో సర్వారం, బేతంపూడి, నిమ్మలగూడెం, సీతంపేట బంజర, సీతంపేట, రాఘవాపురం, నాయకులగూడెం, కోయగూడెం తదితర గ్రామ పంచాయతీల పరిధిలో 11,303 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున 1,13,030 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. పంట సాగు కోసం రైతులు వివిధ కంపెనీల పత్తి విత్తనాలను కొనుగోలు చేసి విత్తారు. సాగైన పత్తి పంటకు దుక్కులు దున్నిన నాటి నుంచి ఎరువులు, పురుగుల మందులు, కూలీలకు కలిపి ఎకరాకు సుమారు రూ.25 వేల పెట్టుబడి అయింది. మొదట్లో పత్తి సాగు బాగానే ఉన్నప్పటికీ ఆ తర్వాత పూత, కాత దశలో అకాల వర్షాలతో పాటు వాతవరణ పరిస్థితులతో తెగుళ్ల ఆశించి పత్తి కాయలు రాలిపోయాయి. దీంతో ఒక్కో చెట్టుకు 15 – 25 కాయలు మాత్రమే మిగిలాయి. వీటిలో కూడా కొన్ని కాయలు అకాల వర్షాలకు గుడ్డి పత్తిగా మారాయి. ఉన్న పంటను కూలీల ద్వారా తీయిస్తే ఒక్కో ఎకరాకు మూడున్నర నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఎన్నడూ లేని విధంగా పత్తిని తీసేందుకుకు ఒక్కో కూలీకి కిలో పత్తికి రూ.10 – రూ.14 వరకు ఖర్చు వచ్చింది. కనీసం పెట్టుబడి అయినా వస్తుందేమో అనుకుంటే మార్కెట్‌లో నాణ్యత లేదనే సాకుతో క్వింటా పత్తికి రూ.6,500 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వచ్చిన పైసలు కూలీలకే సరిపోతున్నాయని, పంట సాగు కోసం తెచ్చిన పెట్టుబడి డబ్బులు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని రైతు వాపోతున్నారు. ఈ ఏడాది పత్తి సాగు వల్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి..

వర్షాలకు తోడు పత్తి చేలల్లో కలుపుతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏకదాటి వర్షాలతో పంట చేలల్లో కలుపు తీవ్రంగా పెరగడంతో, పాటు చేయలేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కలుపు మొక్కలను తొలగించేందుకు కూలీలను పెట్టుకుంటే ఒక ఎకరాకు రూ.5 నుంచి రూ.6 వేల దాకా ఖర్చయ్యే అవకాశం ఉండటంతో.. ఎకరాకు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు చేసి పలువురు రైతులు కలుపు మందును పిచికారీ చేశారు. అయినా పూర్తిస్థాయిలో నివారణ కాలేదు.

ఎకరం సాగు చేశా...



ఒక ఎకరంలో పత్తి పంట సాగు చేశా. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడం వల్ల మొక్కల్లో ఎదుగుదల తగ్గిపోయింది. మొదట్లో వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో రెండు, మూడుసార్లు గింజలు వేయాల్సి వచ్చింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల మొక్కలు ఎర్రబారడంతో పాటు ఎదుగుదల ఆగిపోయింది. పత్తి సాగుతో చాలా నష్టపోయాను.

– బాదావత్ రాంకుమార్, సీతంపేట బంజర

రూ.60 వేల పెట్టుబడి అయింది...



3 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. ఇప్పటి వరకు రూ.60 వేల పైనే పెట్టుబడి అయింది. వర్షాల కారణంగా పత్తి చేలల్లో నీరు నిలిచి మొక్కలు ఎర్రబారాయి. ఇప్పటి వరకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇంకా వచ్చే పరిస్థితి లేదు. క్వింటా పత్తికి ప్రభుత్వం రూ.10 వేలు చెల్లించి పత్తి రైతులను ఆదుకోవాలి. లేదంటే తీవ్రంగా నష్టాన్ని భరించాల్సి ఉంటుంది.

– మారుతీ పెద్ద వెంకన్న, గరీబ్‌పేట

కొనుగోలు కేంద్రం సందర్శన


కారెగట్టులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కొత్వాల

పాల్వంచ: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి, ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.500 బోనస్‌ను పొందాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కారెగట్టులో కొనుగోలు కేంద్రాన్ని కొత్వాల సందర్శించారు. మాట్లాడుతూ... రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ఉండ్రాతి రవి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, యాకిరెడ్డి, వై.వెంకటేశ్వర్లు, కొదుమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ‘చలో కలెక్టరేట్’ను జయప్రదం చేయండి

ఇల్లెందురూరల్: సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం పీవైఎల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. .ఏడాది కాలంగా 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, నేటికీ అనేక శాఖలలో ఖాళీలు అలాగే ఉన్నట్లు చెప్పారు. నూతనంగా ఎన్ని ఉద్యోగాలు సృష్టించిందో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత కూలీలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు, బెల్టు షాపులను నియంత్రించకపోవడంతో గ్రామాలలో యువత వాటికి బానిసలై చిరుప్రాయంలోనే మృతి చెందుతున్నారని వాపోయారు. వ్యాధుల బారిన పడిన ప్రజలకు అవసరమైన మందులు ప్రభుత్వాస్పత్రులలో లేకపోవడంతో కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్తున్నారని, వారికి పలు రకాల పరీక్షలు, అవసరం లేకున్నా అదనంగా మందులు రాసి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు సహకరించండి..


పట్టుబడిన వాహనాలతో డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ

ఇల్లెందు: ఇంటి నుంచి రోడ్డుకు వచ్చిన ప్రతీ వాహనానికి అన్నిరకాల పత్రాలు ఉండాలని, డ్రైవర్‌కు లైసెన్స్ లేకుండా నడపటం నేరమని డీఎస్పీ ఎస్.చంద్రభాను అన్నారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆదివారం ఇల్లెందు పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్రాలు లేని వాహనాలు, బైక్‌లు, లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న వారిని గుర్తించారు. రానున్న కొత్త సంవత్సరం వేడుకలలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఈ పరిస్థితిలో వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా గంజాయి, మత్తు, డ్రగ్స్ మందుల వాడకంతో పాటు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. షీటీమ్స్, సైబర్ నేరాలపై, గంజాయి, డ్రగ్స్ మత్తు మందులు నిరోధం కోసం పోలీసులు నిఘా పెట్టినట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురికావొద్దని, బ్యాంకు, ఏటీఎం కార్డుల, ఓటీపీ వివరాలు ఇతరులకు చెప్పొద్దన్నారు. మెస్సేజ్‌లలో వచ్చే బ్లూ లింక్‌లు క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు నమోదు చేయొద్దని చెప్పారు. సైబర్ మోసాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేయాలని తెలిపారు. వేధింపులపై 100కు సమాచారం అందించాలని కోరారు. వ్యక్తిగత సమాచారం సోషల్ మీడియాలో పోస్టు చేయవద్దని పేర్కొన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీపీలుగా పెట్టుకోరాదన్నారు. ఈ సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు గ్రూప్–2 ప్రశాంతం

కొత్తగూడెం నియోజకవర్గంలో తొలిరోజు గ్రూప్ – 2 పరీక్ష ఆదివానం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల, ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో పరీక్ష సమయాని కంటే గంట ముందే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. అబ్దుల్ కలాంలో రెండు, ధన్వంతరీలో ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

– సుజాతనగర్


కొత్తగూడెంఅర్బన్: పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు


సుజాతనగర్: అబ్దుల్ కలాం కళాశాల వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్న పోలీసులు

ఫొటోగ్రఫీ సంఘం అధ్యక్షుడిగా నాగరాజు




పాల్వంచ: ఫొటోగ్రఫీ సంఘం అధ్యక్షుడిగా జిల్లపెల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా నామ నరేష్, కోశాధికారిగా షేక్ రఫీ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక శ్రీనివాస కాలనీ ఎస్‌వీ ఈవెంట్స్‌లో సంఘం కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు మైలవరపు రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్, ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ, పంపన రమేష్, వెంకటపతి రాజు, శోభన్ బాబు, వీరభద్రం, రమేష్, కార్తీక్, శ్రీకృష్ణ, సురేష్, సుమంత్ కుమార్, వేణు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మినీ వాటర్ స్కీం బోరు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న రుక్మాంగధర్‌బండారి

కొత్తగూడెంఅర్బన్: మినీ వాటర్ స్కీం బోరుతో ప్రజల కష్టాలు తీరుతాయని 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి అన్నారు. ఆదివారం వార్డులో మినీ వాటర్ స్కీంను బోరును ప్రారంభించి మాట్లాడారు. దాదాపు 20 ఏళ్లుగా బోరు లేక ప్రజలు నీటికి ఇబ్బందులు పడుతున్నారని, కిన్నెరసాని రాని సమయంలో నీటి సమస్యలు చాలా ఉంటున్నాయని తెలిపారు. మినీ వాటర్ బోరుతో నీటి కష్టాలు తీరినట్లైందన్నారు.

మానవత్వం చాటిన పోలీసులు


ప్రథమ చికిత్స చేయిస్తున్న ఎస్సై రమాదేవి

సుజాతనగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి గ్రూప్–2 పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ విద్యార్థినిపై సుజాతనగర్ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. అశ్వారావుపేటకు చెందిన ప్రశాంతి అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్–2 పరీక్ష రాసేందుకు వస్తోంది. ఈ క్రమంలో పాల్వంచలో రోడ్డు దాటుతుండగా రోడ్డు ప్రమాదానికి గురైంది. పరీక్షకు సమ యం అవుతుండటంతో మరోవ్యక్తి సాయంతో గాయాలతో కేంద్రానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై రమాదేవి, సీఐ వెంకటేశ్వర్లు పోలీసుల వాహనంలో ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి అదే వాహనంలో పరీక్ష కేంద్రానికి చేర్చారు. దీంతో ఆమె పరీక్ష రాసింది.

స్కౌట్స్‌కు సింగరేణి సంపూర్ణ మద్దతు


అలయ్, బలయ్ కార్యక్రమానికి హాజరైన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): భావి భారతపౌరులను తీర్చిదిద్దే స్కౌట్స్‌కు సింగరేణి సంపూర్ణ మద్దతు, సహకారం అందిస్తుందని డైరెక్టర్ (పీఅండ్‌పీ) అండ్(పా) జి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భవించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆదివారం సింగరేణిలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న మాజీ సింగరేణి అధికారులు స్కౌట్స్ అండ్ గైడ్స్ కొత్తగూడెంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ వ్యవస్థాపకుడు బెడెన్ పవల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పతాకావిష్కరణ చేశారు. మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ వృత్తికే కానీ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యత్వానికి కాదన్నారు. స్కౌట్స్ విద్యార్థులకు దేశ భక్తి, నాయకత్వ లక్షణాలు, విపత్తుల సమయంలో ధైర్యంగా ముందుకెళ్లి సేవ చేసే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవర్చుకునేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం దోహదపడుతుందని, ఇందుకు సింగరేణి యాజమాన్యం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ జేవీ దత్తాత్రేయులు, మాజీ జీఎం, సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీలు కే.బసవయ్య, ఏ.ఆనందరావు, చంద్రమౌళి, పురుషోత్తమ్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ బి.సుశీల్ కుమార్, డీవైపీఎం గట్టుస్వామి, గైడ్స్ ప్రతినిధులు పచ్చా రామకృష్ణారావు, దేవేందర్, రాజారావు, భీమయ్య, గాజుల శ్రీనివాస్, మహ్మద్ ఖాసీమ్, గుంటి కుమారస్వామి, రమేష్‌లాల్, హేమావతి, లక్ష్మీనారాయణ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం ఇప్పించండి..


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి నర్సయ్య, రైతులు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు కెనాల్‌తో భూములు కోల్పోయిన అన్నారుపాడు గ్రామానికి చెందిన పోడు సాగుదారులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆధ్వర్యంలో ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కొత్తగూడెంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. అన్నారుపాడు గ్రామానికి చెందిన 17 మంది గిరిజన రైతుల పోడు భూములు సీతారామ కెనాల్ నిర్మాణంతో కోల్పోయారని, వీరందరికీ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. జూలూరుపాడు ఉపమార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్‌గా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, జవహర్‌లాల్, లోక్యా, పోడుసాగుదారులు బి.రమేష్, సక్రు, బాలు, భద్రు, సరోజని, రమణి, వీరు, వీరస్వామి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ


మెమెంటో అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు పుస్తకాల పురుగులుగా మారుతున్నారని, అలా కాకుండా సాంస్కృతిక పోటీల్లో, క్రీడల్లో రాణించినప్పుడే వారు మానసిక ఉల్లాసంగా ఉంటారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని ఉర్దూఘర్‌లో కొత్తగూడెం ఫిల్మ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీనియర్ డ్యాన్స్ మాస్టర్ ప్రభురాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సూపర్ డాన్స్ – 9 సిరీస్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలు మనోజ్ఞ, తనుశ్రీ, సహస్రలకు బహుమతులను అందించారు. కామేష్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు వారి పిల్లలను ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం పుస్తకాలకే పరిమితం చేస్తున్నారని, దీని వలన వారిలో దాగి ఉన్న కళలను బయటకు తీయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్కే మహబూబ్ అలీ, చెరల వీరభద్రం, కొంచర్ల జోసెఫ్, పుష్కల్, కమల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కౌన్సిల్ నియామకంలో జాప్యం


సింగరేణి ప్రధాన కార్యాలయం ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి లా స్టాండింగ్ కౌన్సిల్ నియామకంలో జాప్యం జరుగుతోందని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్టాండింగ్ కౌన్సిల్‌లో పనిచేసిన సదరు అధికారి మృతి చెందటంతో ఆ పోస్టు అయిదు నెలలుగా ఖాళీ ఉందని, అయితే ఈ పోస్టుకు సంబంధించి నవంబర్ 12న, సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(పా) 15న నిర్వహించిన ఇంటర్వ్యూకు పట్టణంలోని ప్రముఖ న్యాయవాదుల్లో కొంతమంది హాజరయ్యారు. అయితే ఈ పోస్టుకు పలువురు ప్రముఖ రాజకీయ ప్రజాప్రతినిధులు సిఫారసు చేయటంతో ఈ పోస్టుకు ఎవరిని నియమించాలో అధికారులకు అర్థం కానీ పరిస్థితుల్లో అధికారగణం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, సింగరేణి సంస్థకు సంబంధించిన లావాదేవీలు, కార్మికుల ప్రమోషన్లు, గ్రాట్యుటీ, ఇతరత్రా కోర్టు కేసులు చూసుకుంటున్నందుకుగాను ఈ అధికారికి రూ.10 వేల గౌరవవేతనంతోపాటు కోర్టు కేసులకు విడిగా జీతం చెల్లించనుంది కంపెనీ. స్టాండింగ్ కౌన్సిల్ నియామకం లేని కారణంగా ఐదు నెలలుగా కొన్ని సమస్యలు పరిష్కారం కావడం లేదని, వెంటనే సదరు అధికారిని నియమించాలని కార్మికులు కోరుతున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కొత్తగూడెంఅర్బన్: చిన్నారుల ప్రదర్శన

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రామవరంలోని మహిమ ప్రతిష్ట మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ బిన్ను ఆధ్వర్యంలో చిన్నారులు యేసు జననం నాటిక ప్రదర్శించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు పాల్గొన్నారు.

టేకులపల్లి: యేసుక్రీస్తు ప్రార్థన మందిరం, పాస్టర్ బట్టు దేవరాజ్, టేకులపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం తడికలపూడి గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ట్రైబల్ బిషప్ అపోస్తలిక్ యోహాను, సువార్త గాయకులు కుర్సం జయప్రకాష్ ముఖ్యఅతిథులుగా పాల్గొ కేక్ కట్ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్రదర్ ముప్పారపు పాల్ దినకరన్, బ్రదర్ పిడతల మనోహర్ ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. పాస్టర్స్ సనప మార్క్, బ్రదర్ జాన ఆనందరావ్, జాన్ విక్టర్, ప్రేమయ్య, ప్రవీణ్ రాజ్, బల్లెం జాన్ రాజ్, రాజు రాంచందర్ నాయక్, తిమోతి, శైలజ, రత్నజ్యోతి, స్వతంత్ర, బల్లెం కమలాకర్, మెండు జాన్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం



టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంఆర్‌సీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భవనం నిరుపయోగంగా ఉంది. 12 ఏళ్లుగా గృహ నిర్మాణ శాఖ ఆధీనంలో ఉన్న ఈ భవనంలో మూడేళ్లు అటవీ శాఖ కార్యాలయం నిర్వహించారు. ఆ తరువాత ఫారెస్ట్ కార్యాలయాన్ని కొత్తగూడెం తరలించారు. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనం శిథిలావస్థకు చేరక ముందే వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి:
గడదాసు రవీంద్రరావు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నంబర్: 9281479238